క్లుప్తంగా

జూలపల్లిలో మెడికల్ కళాశాల విద్యార్థులు



మెడికోలకు స్వాగతం పలికిన గ్రామస్తులు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామాన్ని రామగుండం మెడికల్ కళాశాల మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థులు శనివారం సందర్శించారు. ×ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన విద్యార్థులకు సర్పంచ్ బొలపెల్లి శంకర్ గౌడ్ స్వాగతం పలికారు. మెడికల్ విద్యార్థులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి ఐదు కుటుంబాలను దత్తత తీసుకుని రెండేళ్ల పాటు వైద్య సేవలందించడానికి ఈ సర్వే ఉధేశ్యమని వైద్య బృందం విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శేవ్వ శంకరయ్య, ఉప సర్పంచ్ సాయికుమార్, హెచ్‌వోడీ డాక్టర్ మధుసూదన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రేమలత, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లున్నారు.

దూర విద్యా కేంద్రాన్ని కొనసాగించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న మధు

గోదావరిఖనిటౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం దూర విద్యా అధ్యయన కేంద్రాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యథావిధిగా కొనసాగించాలని శనివారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యాశాఖ చైర్మన్ లింబాద్రికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు మాలం మధు వినతి పత్రం అందజేశారు. దూర విద్యా అధ్యయన కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించేలా యూజీసీ అధికారులతో మాట్లాడి స్టడీ సెంటర్‌ను కొనసాగించేలా చూడాలని, ఈ ప్రాంతంలో చాలా మంది పేదవారు సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌లలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేస్తున్నారని వారికి దూరవిద్య ఉపయోగపడుతుందని వినతి పత్రంలో కోరినట్లు పేర్కొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన పెంచుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, గ్రామస్తులు

జూలపల్లి: కుష్టువ్యాధి నివారణపై గ్రామాల ప్రజలు అవగాహన పెంచుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. స్పర్శ్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం మండలంలోని వెంకట్రావుపల్లెలో అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కీమలాటపల్లెలో ప్రారంభించనున్న కంటి వైద్యశిబిరం ఏర్పాట్లను ఎంపీడీవో వేణుగోపాలరావుతో కలిసి స్థానిక ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఏఎన్‌ఎంలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలలో, జూనియర్ కళాశాల మౌలిక వసతులకు బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ప్రాధాన్యతనిస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రతినిధి కోలేటి సతీశ్ కుమార్ అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ ఫ్లోర్ లోని వరండాకు గ్రిల్స్ మున్సిపల్ చైర్ పర్సన్ తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, అల్లంకి లింగమూర్తి, కొమురవెల్లి రామ్మూర్తి కొల్లూరు అశోక్ కుమార్ , కౌన్సిలర్లు గుణపతి అనుమాల బాపూరావు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎలిగేడు: రైతులు వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీధర్ అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్, ధూళికట్ట రైతువేదికల్లో సోఅండ్ రీప్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ మార్పులపై అవగాహన కల్పించారు. రైతులు ముందుగా భూసార పరీక్షలు చేయించి అనుకూలంగా ఉండే పంటలు ఎంచుకోవాలన్నారు. ఏవో ఉమాపతి మాట్లాడుతూ వరిలో చీడపీడల నివారణ, ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచులు శాస్త్రవేత్త శ్రీధర్, ఏఈవోలు పద్మ, గణేశ్ పాల్గొన్నారు.

డప్పు కళ.. భళా..!

- రాణిస్తున్న జూలపల్లి మహిళలు
- ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న వైనం..
- కార్యక్రమం ఏదైనా డప్పులు కొడుతున్న మహిళలు

సండే స్పెషల్



జూలపల్లిలో దప్పు కళను ప్రదర్శిస్తున్న మహిళలు

జూలపల్లి: సహజంగా పురుషులు మాత్రమే డప్పు వాయించడంలో ముందుంటారు. గ్రామాల్లో బోనాలకు, ఇతర శుభకార్యాలకు, చావులకు, రాజకీయ నాయకుల మీటింగ్‌లు, ఊరేగింపులకు పురుషులు డప్పులు వాయిస్తాయి. కానీ ప్రస్తుతం మగవారికి ఏ మాత్రం తీసిపోకుండా మహిళలు కూడా డప్పులు వాయిస్తూ రాణిస్తున్నారు. ప్రతి రంగంలో రాణిస్తున్న మహిళలు, ఆర్థికంగా తమ కుటుంబాలకు బాసటగా నిలుస్తూనే పలు రంగాలలో రాణిస్తున్నారు. దేశంలోనే తెలంగాణ మహిళా మణులు ఆర్థిక రంగంలో రాణించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆధునిక టెక్నాలజీ శరవేగంగా ఉరకలేస్తున్న ప్రస్తుత తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచీన కళలకు ఆదరణ కరువవుతోంది. కానీ ప్రస్తుతం గ్రామీణ డప్పు కళలో రాణిస్తున్నారు జూలపల్లి మండల కేంద్రానికి చెందిన మహిళలు. డప్పు కళను బతికించేందుకు నూతన హంగులు జోడించి మహిళలకు శిక్షణనిస్తున్నాడు మండల కేంద్రానికి డప్పు కళాకారుడు మల్యాల కొమురయ్య.

ఆధునిక హంగులు జోడించి శిక్షణ

గ్రామాల్లో డప్పు చప్పుడును శుభకార్యాలకు ,ఎవరైనా చనిపోయిన సందర్భాలలో గతంలో పిలిచేవారు. నూతన ఆవిష్కరణలతో ప్రాచీన డప్పు కళను ఆదరించే వారు లేక డప్పులను మూలన పడేశారు. డప్పు కళను ఎలాగైన బతికించాలన్న ఉధేశ్యంతో కొత్త పద్ధతిలో డప్పులు కొడుతూ రకరకాల స్టెప్పులతో డప్పు కళకు గుర్తింపు తీసుకొస్తున్నాడు కొమురయ్య, తనకు ఉన్న ఈ కళను పలువురికి పంచాలనే చాలా మందికి నేర్పుతున్నాడు. ఇప్పటికే ఇతర గ్రామాల్లో 250 మంది వరకు డప్పు కళను, ఆకర్షణతో కూడిన డ్రెస్ కోడ్‌తో నేర్పించారు. ఇందులో జూలపల్లి మండల కేంద్రానికి చెందిన 20 మంది మహిళలు కొమురయ్య ఆధ్వర్యంలో శిక్షణ పొంది రాణిస్తున్నారు.

రాజకీయ సభలు, ర్యాలీల్లో ప్రత్యేకార్షణ

ఎన్నికల సమయంలో,బహిరంగ సభల ర్యాలీల్లో డ్రెస్ కోడ్ కూడిన డప్పు కళ రకరకాల స్టెప్పులతో,డప్పు కొడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.. దీంతో నాయకులు, పార్టీలు తమ బహిరంగ సభలకు పిలిచి,ర్యాలీల్లో డప్పు కళను ప్రదర్శించేలా ఏర్పాట్లు చేస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఆయా సందర్భాల్లో డప్పులు కొడుతూ తమ కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడుతున్నారు.

ప్రదర్శనలతో ఉపాధి, గుర్తింపు వస్తోంది



డప్పు కళలో ఇరవై మంది మహిళలం శిక్షణ తీసుకున్నాం. మమ్మల్ని రాజకీయ పార్టీల ర్యాలీల్లో ప్రదర్శనకు పిలుస్తున్నారు. దీంతో మాకు ఉపాధి దొరకడంతో పాటు డప్పు కళకు ప్రజల్లో ఆదరణ వస్తోంది. చాలా మందిప్రదర్శనలకు ఆహ్వానిస్తున్నారు.

– మానుమండ్ల చంద్రమ్మ, కళాకారిణి

ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి



గ్రామీణ ప్రాంతాలలో ఉన్న డప్పు కళను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయడంలో డప్పు కళను ప్రదర్శించే అవకాశం కల్పించాలి. దీంతో గ్రామీణ డప్పు కళకు గుర్తింపు రావడంతో పాటు ఉపాధి కల్పించినట్లవుతుంది. డప్పు కళాకారులకు పింఛన్లు ఇచ్చి కళాకారులుగా గుర్తించాలి. డప్పు కళను ప్రదర్శించే వారికి దళిత బంధులో ముందుగా అవకాశం కల్పించాలి.

– మల్యాల కొమురయ్య, శిక్షకుడు

సంక్షేమ పథకాల ప్రచారంలో ప్రాధాన్యమివ్వాలి



పేద డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి.డప్పు కళను బతికించేందుకు సంక్షేమ పథకాల ప్రచారంలో ప్రాధాన్యమిచ్చి ఉపాధి కల్పించుకునేందుకు అవకాశమివ్వాలి.అప్పుడు మరింత మంది కళను నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం కళాకారులు పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలి.

– నెరువట్ల రాజమ్మ, కళాకారిణి, జూలపల్లి

కమనీయం శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని హరిహర ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణంతో ముగిశాయి. వేద పండితులు ప్రవీణ్ శర్మ, రఘునాథ శర్మ, అరవింద్ శర్మ, సాయివిశాల్ శర్మ వేద మంత్రాలతో కమనీయంగా కడు రమణీయంగా జరిపించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది యెరబాటి అశోక్ రావు సుమిత, ఆర్యవైశ్యంఘం నాయకుడు ఇమ్మడి సీను జ్యోతి దంపతులు, ఆలయ వ్యవస్థాపకులు ఎరబాటి రాజేశ్వర్ రావు, సర్పంచ్ శ్రీదేవి, వైస్ ఎంపీపీ శిరీష, ఆలయ అభివృద్ధి కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నంబులాద్రి కల్యాణోత్సం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి శ్రీనంబులాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోమలత, ఎంపీపీ బాలాజీరావు, సింగిల్‌విండో చైర్మన్ మోహన్ రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌చందర్ తదితరులున్నారు.

మొదలైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పెద్దపల్లిరూరల్: జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవ వేడుకలకు ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా అలంకరించారు. శనివారం ఉదయం అధ్యయనోత్సవంతో ఉత్సవాలు ఆరంభమయ్యాయని అర్చకులు భాష్యం రంగాచార్యులు తెలిపారు. ఈనెల 6న శోభాయాత్ర,8న స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బొంకూరి శంకర్, రాజ నరేందర్ తెలిపారు.

మున్నూరు కాపులు అన్ని రంగాల్లో ముందుండాలి

పెద్దపల్లిరూరల్: మున్నూరుకాపులు అన్ని రంగాల్లో ముందుండాలని, ఇబ్బందులు ఎదురైతే సమష్టిగా ఎదుర్కొని సత్తా చాటాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని అమర్‌చంద్ కళ్యాణమండపంలో శనివారం జరిగిన మున్నూరు కాపు సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. పార్టీలకతీతంగా కాపులు రాజకీయరంగంలో రాణించాలన్నారు. మున్నూరు కాపు జనాభాకు అనుగుణంగా చట్టసభల్లో ప్రాధాన్యత లేదని, వచ్చే ఎన్నికల నాటికి అందరూ ఏకమై రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఉన్నత విద్యకోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లే విద్యార్థులకోసం వసతి గృహాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కాపుల హక్కుల సాధనకు పనిచేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిశంకర్, యూత్ కో-కన్వీనర్ స్వామివివేక్ పటేల్, ఉపాధ్యక్షుడు ఎల్.రాజయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు అమిరిశెట్టి రామస్వామి, తూముల శ్రీనివాస్, నాయకులు సత్యం, ఆకుల కిరణ్, గాండ్ల స్వామి, సత్యనారాయణ, శ్రీనివాస్, పూదరి చంద్రశేఖర్, సతీశ్, తూముల మహేశ్ తదితరులున్నారు.

కుర్సుకమ్మి భూముల నిగ్గు తేల్చాలి



మాట్లాడుతున్న మహేశ్, నాయకులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట, రాయదండి గ్రామాల శివారులో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న కుర్సుకమ్మి భూముల నిగ్గు తేల్చాలని, బాధిత రైతులకు సదరు భూములను అప్పగించి పట్టాలు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అంతర్గాం మండల కేంద్రంలో మాట్లాడారు. ఇటీవల సీఎస్ శాంతికుమారిని కలిసిన ఎమ్మెల్యే కుర్సుకమ్మి భూసమస్యను పరిష్కరించాలని సీఎస్‌ను కోరినట్లు సోషల్ మీడియాలో వైరల్ చేసుకుంటూ రాజకీయ లబ్ధి పొందుతున్నారన్నారు. మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం మాట్లాడుతూ అంతర్గాం మండల పరిధిలో ఓ వైపు 1018 ఎకరాల కుర్సుకమ్మి భూములు, మరోవైపు ప్రతిపాదిన బీపీఎల్ ప్రాజెక్టు సేకరించిన వేలాది ఎకరాలు నిరూపయోగంగా ఉన్నాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రతినిధులు మద్ది తిరుపతిగౌడ్, అప్పాల రాజేందర్, పల్లె రవీందర్,తదితరులున్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు పెంచాలి



ప్రత్యేక పూజలు చేస్తున్న దాసరి ఉష

సుల్తానాబాద్‌రూరల్: చట్టసభల్లో బీసీలకు 52శాతం రిజర్వేషన్లు పెంచాలని బహుజన సమాజ్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి దాసరి ఉష డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలం తొగర్రాయిలో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద శనివారం బీసీ కులగణన, రిజర్వేషన్లు పెంచాలని బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కోటి సంతకాల సేకరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి బాల కల్యాణ్, ఉపాధ్యక్షుడు తోట వెంకటేష్, సలహాదారులు బాబు, కోశాధికారి శేషాద్రి, డివిజన్ అధ్యక్షుడు దుర్గయ్య, ఉపాధ్యక్షుడు గోపాల్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, కార్యదర్శి రియాజ్ తదితరులున్నారు.

మహిళలను వేధిస్తే కటకటాలే..

- పెద్దపల్లి డీసీపీ వైభవ్



మాట్లాడుతున్న డీసీపీ వైభవ్

పెద్దపల్లిరూరల్: మహిళల రక్షణకు అనేక చట్టాలు అమల్లో ఉన్నాయని, వేధింపులకు గురైనవారు ధైర్యంగా పోలీసులకు సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ వైభవ్‌గైక్వాడ్ అన్నారు. పెద్దపల్లిలో శనివారం నందనగార్డెన్‌లో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థినులకు చట్టాలు, టోల్‌ఫ్రీ నంబర్లు, సోషల్‌మీడియా, ప్రేమపేరిట వేధింపులు, సెల్‌ఫోన్ వినియోగం, యువత పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చేలా క్రమశిక్షణతో చదవాలన్నారు. ఈవ్ టీజింగ్‌కు గురైనా.. ఆపదలో ఉన్నా నిర్భయంగా 100, 108, 1098, 181కు సమాచారం అందించాలన్నారు. సైబర్‌నేరాలకు గురైతే 1930 హెల్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. ప్రేమ పేరిట మోసపోయి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారని ఏసీపీ ఎడ్ల మహేశ్ అన్నారు. సీఐలు ప్రదీప్‌కుమార్, అనిల్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాజేశ్, గాయత్రీ కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ తదితరులున్నారు.

నాబార్డ్‌తో ఎన్టీపీసీ ఒప్పందం

జ్యోతినగర్: ఎన్టీపీసీ నీటి సంరక్షణ, పేద నిర్వహణ, ఆహార భద్రత వంటి వాటికి పరిష్కారం అందించే లక్ష్యంతో సాంకేతికతను ఉపయోగించి ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం నిర్వహణకు నాబార్డుతో ఎన్టీపీసీ రామగుండం ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఈడీ సునీల్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని కన్నాల, రాణాపూర్, బామ్లానాయక్ తండా, బ్రాహ్మణపల్లి, అంతర్గాం, జీడీనగర్‌తోపాటు ఆరు గ్రామాల క్లస్టర్స్‌తో సాధారణ రైతుల ఆదాయం, పంట ఉత్పాదకత అంశాలపై రూ.54.29లక్షలతో ఒప్పందం కుదిరింది. 100 ఎకరాల కంటే ఎక్కువ బంజేరుభూమిని సారవంతంగా మార్చే ప్రయత్నంతో సమీకృత వ్యవసాయ వ్యవస్థ ద్వారా 20 మందికి పైగా ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం కలుగనుంది. కార్యక్రమంలో నాబార్డ్, తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై మహిళలకు అవగాహన



కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మ

రామగిరి: సెంటినరీకాలనీలోని సేవాభవన్‌లో శనివారం మహిళలకు సింగరేణి ఆరోగ్య అధికారి డాక్టర్ పద్మ కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ పై అవగాహన కల్పించారు. తొలిదశలో గుర్తిస్తే కేన్సర్‌కు చికిత్స చేయవచ్చని ఆమె తెలిపారు. కేన్సర్ లక్షణాలు, నియంత్రణ చర్యలు గురించి వివరించారు.

విద్యార్థులకు ..

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కేన్సర్ వ్యాధి పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో వైద్యులు కామని శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎలగందుల శ్రీనివాస్, డిస్ట్రిక్టు చైర్‌పర్సన్ శ్రీనివాస్, ఆర్‌సీ సామ ఎల్లారెడ్డి, కార్యదర్శి మునీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అనంత రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమానికి నిధులు కేటాయించండి

మంథని: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ నిధికి ప్రభుత్వం పదివేల కోట్లు కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేల మారుతి డిమాండ్ చేశారు. శనివారం మంథనిలో మాట్లాడారు. ఉద్యమకారుల త్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, వారి సంక్షేమ కోసం నిధి ఏర్పాటు చేయాలన్నారు. నేడు పెద్దపల్లి, 12న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యమ కార్యాచరణ సమవేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైన జ్యోతిరెడ్డిని సన్మానించారు. కార్యదర్శి ముస్కె ఈశ్వరమ్మ, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి వేల్పుల గట్టయ్య, రాష్ట్ర కార్యదర్శి రామగుడు మారుతి,మంథని విజయ్ ఉన్నారు.

మట్టికుండలను తిలకించిన విద్యార్థులు

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో శాలీవాహనుల మట్టికుండల తయారీని ఇదే గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం తిలకించారు. పరిసరాల విజ్ఞానం లోని మట్టితోచేసిన మాణిక్యాలు పాఠంను ప్రాక్టికల్‌గా విద్యార్థులకు కాగజ్‌నగర్‌కు చెందిన వ్యక్తి మట్టికుండలను తయారు చేస్తుండగా చూశారు. హెచ్‌ఎం లక్ష్మణస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీల్డ్ చానల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఓదెల: పంట పొలాలకు నీటిసౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ఫీల్డ్‌చానల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జి సత్తయ్య తెలిపారు. శనివారం గోపరపల్లెలో ఫీల్డ్‌చానల్స్‌ను ఎంపీడీవో పరిశీలించారు. రైతులు సేద్యం చేస్తున్న పంట పొలాలు ఎండిపోకుండా నీరందించటం కోసం కూలీలతో ఫీల్డ్‌చానల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్క మల్లారెడ్డి, ఎంపీటీసీ గోపు లావణ్య, ఎంపీవో వాజీద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన మిరాల రాజుకు చెందిన గుడిసె రెండు రోజుల క్రితం కాలిపోగా, మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతరులు అండగా నిలిచి శనివారం రూ. 35 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్కం రవీందర్, పాఠశాల యాజమాన్యం వినయ్, సౌమ్య ఉన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పోస్టల్ ఉద్యోగులు

గోదావరిఖనిటౌన్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శనివారం స్థానిక పోస్టాఫీస్ నుంచి మెయిన్ చౌరస్తా మీదుగా పోస్టల్ ఉద్యోగులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ నెల 9, 10వ తేదీలలో పోస్టల్ డైరెక్టర్ నుంచి ఏఎంఆర్‌ఐటీపీఈఎక్స్ నిర్వహిస్తున్నారు. ఈ రోజుల్లో సుకన్య ఖాతా మహోత్సవ్ జరపాలని నిర్ణయించారు. కనుక నేటి నుండి ఈ నెల 9వ తేదీ వరకు గో తపాలా కార్యాలయాలలో ప్రత్యేక కౌంటర్స్ తెరిచి ఉంటాయని తెలిపారు. ర్యాలీలో గోదావరిఖని పోస్టల్ సబ్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ మేరుగు శ్రీనివాస్, పోస్టుమాస్టర్ యు.సతీష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థ పనితీరుపై అవగాహన



చట్టాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్సై

సుల్తానాబాద్: నేరాల అదుపునకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు వారి పనితీరుపై అల్ఫోర్స్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం సుల్తానాబాద్ లోని అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు సిలబస్ లో భాగంగా నేరుగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీస్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠ్యాంశంలోని విషయాలపై విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరిస్తే ప్రతి విషయంపై వారికి అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఉపేందర్ రావు, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేసీఆర్ కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దాసరి

సుల్తానాబాద్: క్రీడాకారులకు రిజర్వేషన్ ప్రకటించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని పెద్దపెల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కప్ మండలస్థాయి క్రికెట్ పోటీలను ఆయన స్థానిక శాస్త్రీనగర్‌లో శనివారం ప్రారంభించారు. సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఏటా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ, మండల, మున్సిపాలిటీ వార్డు పరిధిలో పోటీలు ఉంటాయని, విజేతకు జట్టుకు రూ.50వేలు, రన్నర్‌కు రూ.25వేల నగదు బహుమతి అందిస్తామని పేర్కొన్నారు. ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కాసర్ల అనంత రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, మాజీ ఎంపీపీ ఐల రమేశ్, పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, తాళ్లపెల్లి మనోజ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, కన్వీనర్ రాజ మల్లయ్య, పట్టణ అధ్యక్షుడు పారుపెల్లి గుణపతి, సూర శ్యామ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పీజీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థిని

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు ఫ్రెషర్స్ డే పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా శాతవాహన యూనివర్సిటీ పరీక్షా నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్‌వి రంగాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయరాదన్నారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ అదనపు పరీక్షమ నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.